
సాక్షి గుంటూరు
సోమవారం ॥ 22 ॥ జనవరి ॥ 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరుఎడ్యుకేషన్: ఏబీటీఏ ఉర్దూ ఏపీ గుంటూరు జిల్లా శాఖ నూతన క్యాలెండర్‌ను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం ఆదివారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

బండ్లమ్మకు పూజలు



చందోలు(పిట్టలవాని పాలెం): మండలంలోని చందోలులో ఉన్న బగ ళాముఖి బండ్లమ్మ దేవా లయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు.

అన్ని అమిర్చి.. మద్దతు ఇచ్చి!

నడికుడి కొనుగోలు కేంద్రంలో ముమ్మరంగా మిర్చి కొనుగోలు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 5.38లక్షల క్వింటాళ్లు కొనుగోలు
- పల్నాడు రైతులకు వరంగా కొనుగోలు కేంద్రం
- కొనుగోలు కేంద్రం అభివృద్ధికి ఎమ్మెల్యే కాసు ప్రత్యేక చర్యలు



కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన మిర్చి బస్తాలు

దాచేపల్లి: ఆరుగాలం కష్టపడి మిర్చి పంటను పండించే రైతులకు కష్టాలు తప్పాయి. పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు పడిగాపులు కాసే రోజులకు చెక్‌పెట్టి యార్డుకి వెళ్లిన మరుక్షణం పంటను అమ్ముకుని రైతులు హాయిగా ఉంటున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన మిర్చి కొనుగోలు రైతులకు వరంగా మారింది. పల్నాడు ప్రాంతంలోని గురజాల, మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాలతో పాటుగా తెలంగాణలోని మిర్యాలగూడెం, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో పండించిన మిర్చి పంటను ఇక్కడకు తీసుకువచ్చి అమ్ముకుంటున్నారు. ఒకప్పుడు వ్యయప్రయాసలతో గుంటూరు మార్కెట్ యార్డుకి వెళ్లి మిర్చి అమ్ముకునే రైతులు ఇప్పుడు అందుబాటులో ఉన్న నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని మిర్చి కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చి అమ్ముకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు 53,800 మంది రైతుల నుంచి 5.38లక్షల క్వింటాళ్ల మిర్చిని కొనుగోలు చేయగా మార్కెట్‌యార్డుకి రూ.5.98 కోట్ల ఆదాయం సమకూరింది.

ఖర్చు తక్కువ.. లాభాలు ఎక్కువ

అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేను ఆనుకుని 15 ఎకరాల విస్తీర్ణంలో నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు ఉంది. 2012లో ఇక్కడ మిర్చి కొనుగోలు కేంద్రాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. నామమాత్రంగా మిర్చి కొనుగోలు జరగ్గా 2014లో టీడీపీ ప్రభుత్వంలో కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మిర్చి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించారు. గుంటూరు యార్డులోని మిర్చి కమీషన్ ఏజెంట్లతో పలుమార్లు చర్చలు జరిపి ఇక్కడ మిర్చి కొనుగోలు చేయించేలా ఒప్పించారు. దీంతో 2019 నుంచి ఇప్పటివరకు 38 మంది కమీషన్ ఏజెంట్లకు లైసెన్స్‌లు ఇప్పించి యార్డులో దుకాణాలు కేటాయించి ప్రతి రోజు మిర్చి విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు సగటున యార్డుకు 5వేల నుంచి 6వేల బస్తాలు వస్తాయి.. మిర్చి కొనుగోలు జరిగిన వెంటనే రైతులకు డబ్బులను అందజేస్తారు. ఇక్కడ మిర్చి విక్రయాలు జోరుగా జరుగుతుండటంతో గుంటూరు యార్డుకి పల్నాడు ప్రాంతం నుంచి వెళ్లే రైతుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2019 నుంచి 2023 డిసెంబర్ నెలఖారు నాటికి 43,800 మంది రైతుల నుంచి 4.38.350 క్వింటాళ్ల మిర్చిని ఇక్కడ కొనుగోలు చేశారు. ఇక్కడ మిర్చి కొనుగోళ్లు జరగటం వలన 2019 నుంచి 2023 వరకు సెల్ ద్వారా రూ 5.98 కోట్ల ఆదాయం మార్కెట్ యార్డుకు వచ్చింది.

రైతులను ప్రభుత్వం ఆదుకుంది..



నేను ఏటా మూడు నుంచి ఐదు ఎకరాల్లో మిర్చి సాగు చేస్తాను. ఎకరానికి సగటున 20 నుంచి 25 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తుంది. గత కొన్నేళ్ల నుంచి నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రంలోనే మిర్చి అమ్ముతున్నాను. గుంటూరులో ఏ ధర వస్తుందో ఇక్కడ కూడా అదే ధర వస్తుంది. ఇక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకుంది.

– గుదూరి చలమయ్య, తక్కెళ్లపాడు

కష్టాలు తప్పాయి..



మిర్చి పంటను పండించటం ఒక ఎత్తయితే..పండించిన పంటను అమ్ముకోవటం మరో ఎత్తు..మిర్చి కోసిన తరువాత ఆర బెట్టి తెల్లకాయలు వేరు చేసి బస్తాల్లో పెట్టి యార్డుకు పంపిస్తాం. నడికుడి యార్డులో మిర్చిని తీసుకెళ్లిన రోజే కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా మిర్చి కొనుగోలు చేస్తున్నారు. మా కష్టాలు తప్పాయి.

– పొన్నం నారాయణ, కొత్తపాలెం

రైతులకు అండగా ప్రభుత్వం..



నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ సీసీఐతో పాటుగా మిర్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాం. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గుంటూరు నుంచి మిర్చి కమీషన్ ఏజెంట్లను ఇక్కడకు తీసుకువచ్చారు. కేంద్రం ఏర్పాటుతో రైతులకు ఎంతో ప్రయోజనంతో పాటు యార్డుకు కూడా ఆదాయం సమకూరుతోంది.

– కలకంద అంద్రయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్

కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించిన కలెక్టర్

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల గ్రామంలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో శనివారం ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు ఆదివారం సైతం కొనసాగాయి. అగ్నిమాపక సిబ్బంది నిర్విరామంగా మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్నారు. ఈక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్‌తో కలసి కోల్డ్‌స్టోరేజ్‌ను పరిశీలించారు. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపకశాఖ వారు ఉపయోగిస్తున్న అత్యాధునిక యంత్రంపై నుంచి కోల్డ్‌స్టోరేజ్ పైభాగంలో ఎగసిపడుతున్న మంటలను పరిశీలించారు. మంటలను అదుపు చేసేందుకు చేస్తున్న యత్నాలను అగ్నిమాపక శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు ప్రజలను కోల్డ్ స్టోరేజ్ పరిసర ప్రాంతాలకు రాకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, పోలీస్, అగ్నిమాపక, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సిబ్బంది ఉన్నారు.



మంటలు ఆర్పే యంత్రంపై నుంచి కోల్డ్ స్టోరేజీను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

నూతన గురువుల దివ్య బలిపూజ

పెనమలూరు: కానూరులో ఆదివారం నూతన గురువుల దివ్యబలి పూజ ఘనంగా నిర్వహించారు. కానూరు మౌంట్ కార్మేల్ మాత పుణ్యక్షేత్రంలో ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఏడుగురు నూతన గురువులతో మొదటి దివ్యబలి పూజను సమర్పించారు. 14 ఏళ్లుగా బైబిల్ గ్రంథ పఠనం, పలు రాష్ట్రాల్లో శిక్షణ పొంది గురుపట్టాభిషేకంతో మొదటి సారిగా కానూరులో దివ్యబలి పూజలు నిర్వహించారు. పోరంకి, గంగూరు, కానూరు నుంచి భక్తులు పాల్గొన్నారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాలు అందజేశారు.

పలువురు సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా ఇటీవల జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేయడం పాఠక విధితమే.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
కె.శ్రీనివాసరెడ్డి	తెనాలి రూరల్ సర్కిల్, గుంటూరు జిల్లా	డీఎస్‌బీ, బాపట్ల జిల్లా
ఇ.మాలకొండయ్య	డీటీసీ/డీటీఆర్‌బి, బాపట్ల జిల్లా	రేంజ్ వీఆర్ గుంటూరు
సి.సీతారామయ్య	చిలకలూరిపేట టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా	రేంజ్ వీఆర్ గుంటూరు
ఎస్.విజయచంద్ర	రేంజ్ వీఆర్, గుంటూరు	చిలకలూరిపేట టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
కె.మల్లికార్జున	నగరంపాలెం పీఎస్, గుంటూరు జిల్లా	నరసరావుపేట రూరల్ సర్కిల్, పల్నాడు
ఎ.మల్లికార్జునరావు	తాడేపల్లి పీఎస్, గుంటూరు జిల్లా	రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల జిల్లా
కె.వీరాస్వామి	పెదకూరపాడు సర్కిల్, పల్నాడు జిల్లా	పెదకాకాని పీఎస్, గుంటూరు జిల్లా
బి.సురేష్‌బాబు	పెదకాకాని పీఎస్, గుంటూరు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
ఎ.సుధాకర్	రేంజ్ వీఆర్ గుంటూరు	తెనాలి టుటౌన్ పీఎస్, గుంటూరు జిల్లా
ఎస్.వెంకట్రావు	తెనాలి టుటౌన్ పీఎస్, గుంటూరు జిల్లా	రేంజ్ వీఆర్ గుంటూరు
ఏ.వి.శివప్రసాద్	పీసీఆర్, గుంటూరు	రేంజ్ వీఆర్, గుంటూరు
వి.సూర్యనారాయణ	దిశ, బాపట్ల జిల్లా	సోషల్ మీడియా/సైబర్ క్రైం సెల్, ప్రకాశం జిల్లా
పసుపులేటి రామకృష్ణ	ఎస్సీ, ఎస్టీ సెల్, బాపట్ల జిల్లా	వేమూరు సర్కిల్, బాపట్ల జిల్లా
జి.వెంకటరావు	రేంజ్ వీఆర్ గుంటూరు	మంగళగిరి రూరల్ సర్కిల్, గుంటూరు జిల్లా
వి.భూషణం	మంగళగిరి రూరల్ సర్కిల్, గుంటూరు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
ఎం.మధుసూదనరావు	రేంజ్ వీఆర్	తాడేపల్లి పీఎస్, గుంటూరు జిల్లా

రంగుల సంబరానికి సంసిద్ధం



రంగులకు వెళ్లేందుకు మండపంలో కొలువుతీరిన దేవతామూర్తుల విగ్రహాలు(ఫైల్)

- ఫిబ్రవరి ఒకటో తేదీన పెనుగంచిప్రోలు నుంచి తిరుపతమ్మ పయనం
- జగ్గయ్యపేట మండపం వద్ద రంగులు
- ఫిబ్రవరి 20న తిరిగి రాక

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి రంగుల మహోత్సవం వచ్చిందంటే పెనుగంచిప్రోలు, మక్కపేట, చిల్లకల్లు, జగ్గయ్యపేట, భీమవరం, లింగగూడెం గ్రామ ప్రజలకు, వారి బంధువుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ఇక్కడ ఇంతకన్నా పెద్ద పండుగ మరొకటి లేదు. పురాతన కాలంలో చెక్కతో చేసిన విగ్రహాలు కావటంతో విగ్రహాలకు చిన్నచిన్న మరమ్మతులు అవసరమవుతాయి. దీంతో ప్రతి రెండేళ్లకు ఆలయంలోని 11 విగ్రహాలను జగ్గయ్యపేటలో రంగులు వేస్తారు. ఈ పనులు పూర్వ కాలం నుంచీ నకాసి వంశీయులు చేస్తున్నారు. ఫిబ్రవరి ఒకటిన రంగులకు బయలు దేరే విగ్రహాలు ఫిబ్రవరి 2 తెల్లవారు జామున జగ్గయ్యపేటకు చేరుతాయి. రంగుల అనంతరం ఫిబ్రవరి 18న తెల్లవారు జామున జగ్గయ్యపేటలో బయలు దేరతాయి. జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు, రాత్రికి వత్సవాయి మండలం భీమవరానికికు విగ్రహాలు చేరుతాయి. అనంతరం ఫిబ్రవరి 19న భీమవరం నుంచి పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం గ్రామానికి చేరుకుంటాయి. సాయంత్రం పెనుగంచిప్రోలు రంగుల మండపం వద్దకు చేరుకుని, రాత్రికి రథంలో ఊరేగింపుగా ఫిబ్రవరి 20న తెల్లవారు జామున పెనుగంచిప్రోలు ఆలయానికి చేరుకుంటాయి.

తిరుగు ప్రయాణంలో..

గోపయ్య సమేత తిరుపతమ్మ వారితో పాటు సహదేవతల విగ్రహాలను తిరుగు ప్రయాణంలో రజకులు జగ్గయ్యపేట నుంచి పల్లకీల్లో చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం మీదుగా పెనుగంచిప్రోలుకు చేరుస్తారు. పల్లకీలు పెనుగంచిప్రోలు–5, అనిగండ్లపాడు, సుబ్బాయిగూడెం, ముండ్లపాడు గ్రామాలకు చెందిన ఒక్కో పల్లకీ ఉంటుంది. గ్రామాల్లో పల్లకీలకు భక్తులు ఎదురేగి స్వాగతం పలుకుతారు. మొక్కులు తీర్చుకొని కుటుంబసభ్యులు, బంధుగణంతో సరదాగా గడుపుతారు.

రజకులు నెత్తిపై పెట్టుకొని మోసుకుంటూ..

ఆలయం నుంచి విగ్రహాలను బయటకు తీసిన తర్వాత రజకులు వాటిని నెత్తిన పెట్టుకొని మోసుకుంటూ గ్రామం చివరన ఉన్న రంగుల మండపం వరకు చేరుస్తారు. అక్కడ నుంచి విగ్రహాలను గ్రామానికి చెందిన రైతులు అందంగా అలంకరించిన ఎడ్లబండ్లపై ఒక్కొక్క బండిపై ఒక్కో విగ్రహాన్ని ఉంచి జగ్గయ్యపేటలో రంగులు వేసే మండపం వద్దకు మక్కపేట, చిల్లకల్లు మీదుగా భక్తజన సందోహం మధ్య తీసుకెళ్తారు.

న్యూస్‌రీల్

అయోధ్య మందిరం మినియేచర్



తెనాలి: అయోధ్యలో రామమందిరం ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా ఆలయ నమూనా మినియేచర్‌ను తెనాలి సూర్యశిల్పశాల నిర్వాహకుల్లో ఒకరైన కాటూరి శ్రీహర్ష రూపొందించారు. త్రీడీ టెక్నాలజీలో నిపుణుడైన శ్రీహర్ష, అదే సాంకేతికతను వినియోగించి తీర్చిదిద్దిన నమూనా, సోమవారం తమ శిల్పశాల ఎదుట ప్రదర్శనగా ఉంచనున్నట్టు తెలియజేశారు. రామభక్తులు విచ్చేసి ఆలయ నమూనాను తిలకించాల్సిందిగా విజ్ఞప్తిచేశారు.

ఎంసీహెచ్‌కు రూ. 2 కోట్లు విరాళం



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల 1965 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ తాతినేని గోపాలరావు, బీనా దంపతులు గుంటూరు జీజీహెచ్‌లో నిర్మాణమవుతున్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణం కోసం రూ. 2 కోట్లు విరాళం ప్రకటించారు. అందులో భాగంగా ఆదివారం జింకానా కో–ఆర్డినేటర్ డాక్టర్ వెనిగళ్ల బాలభాస్కరరావును కలిసి రూ.75 లక్షల చెక్కును అందజేశారు. ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ వెంకటేశ్వరరావు పేరు మీదుగా డాక్టర్ తాతినేని గోపాలరావు దంపతులు చెక్కు అందజేశారు. విరాళం అందజేసిన వైద్యులకు డాక్టర్ బాలభాస్కరరావు కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సజావుగా సీ–టెట్



గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీ–టెట్) ఆదివారం గుంటూరు జిల్లాలో సజావుగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన పేపర్–1, 2 పరీక్షలకు దరఖాస్తు చేసిన 1,550 మంది అభ్యర్థుల్లో 1,090 మంది హాజరయ్యారు. గుంటూరు నగరంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య స్కూల్, డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌తో పాటు పొన్నూరులోని నాట్కో స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల పరిధిలో అభ్యర్థులకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు హాజరైన అభ్యర్థులే తిరిగి మధ్యాహ్నం జరిగిన పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేశారు.

విధులకు హాజరు కాని అంగన్‌వాడీలపై చర్యలు

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా మహిళా, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ అంగన్‌వాడీ వర్కర్స్ సోమవారం నుంచి విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం విధించిన గడువులోపు విధులకు హాజరు కాని అంగన్‌వాడీ సిబ్బందిపై ప్రభుత్వం తీసుకునే చర్యల్లో భాగంగా వారిని విధుల నుంచి తొలగించడం జరుగుతుందన్నారు.

‘చలో విజయవాడ’కు అనుమతుల్లేవు



నగరంపాలెం: ఈనెల 22న అంగన్‌వాడీ మహిళలు తలపెట్టిన ‘చలో తాడేపల్లి, చలో విజయవాడకు ఎటువంటి అనుమతుల్లేవని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలను ఆసరా చేసుకుని అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఆయా కార్యక్రమాలకు అనుమతుల్లేవని అన్నారు. గుంటూరు నగరంలో 30 పోలీస్ చట్టం అమల్లో ఉందని తెలిపారు. ఎవరైనా పోలీస్ ఆదేశాలను ధిక్కరించి కార్యక్రమాల్లో పాల్గొంటే, వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

దుర్గగుడిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సంక్రాంతి సెలువులు ముగియడం, సోమవారం నుంచి స్కూళ్లు పునఃప్రారంభం కానుండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, ఘాట్‌రోడ్డు, మహా మండపం మెట్లు, లిఫ్టు మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌తో పాటు రూ. 100, రూ.300, రూ. 500 టికెట్ క్యూలైన్లు కిటకిటలాడాయి. మరో వైపు ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంతో పాటు ఆదివారం నిర్వహించే సూర్యోపాసన సేవలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. మహా నివేదన అనంతరం అన్ని దర్శనాలు ప్రారంభం కాగా సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కోనేరు నిర్మాణానికి రూ.లక్ష వితరణ

నెమలి(గంపలగూడెం): ఎన్టీఆర్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో కోనేరు నిర్మాణానికి ఒక భక్తుడు రూ.1,00,151ను వితరణగా ఇచ్చారు. హైదరాబాద్ మేడిపల్లికి చెందిన దివంగత గంతుల సాయిబాబ జ్ఞాపకార్థం భార్య నాగపార్వతి, కుమారుడు విజయ ఫణీంద్ర ఈ మొత్తాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. స్వామి పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలాచార్యులు దాతల్ని ఆశీర్వదించి స్వామి ప్రసాదం అందజేశారు.

క్లుప్తంగా

మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కిరణ్



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికల్, హెల్త్ మినిస్టీరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బొక్క కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ నాగూర్ షరీఫ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా గుంటూరు జీజీహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీక్రాంత్, జిల్లా కోశాధికారిగా ఎ.అరుణ్‌బాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా లంకపల్లి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఖాదర్‌వలి, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.రామకృష్ణను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు మినిస్టీరియల్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కె.వి.ఎస్.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఇంటర్నెట్ సేవలు



పాత గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ ఇంటర్నెట్, ట్రిపుల్ ప్లే సేవలు అందించాలన్న సంకల్పంతో ఏపీఎస్ఎఫ్ఎల్ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో ఏపీ ఫైబర్ నెట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఫైబర్‌నెట్ జిల్లా మేనేజర్ చిట్టి శివారెడ్డి తెలిపారు. ఆదివారం గుంటూరు జిల్లా కార్యాలయంలో కేబుల్, ఇంటర్నెట్ సేవల బ్రోచర్ ఆవిష్కరించారు. శివారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో ఉచితంగా సర్వీసులను అందిస్తున్నట్లు చెప్పారు. రూ.190 ప్యాకేజీతో ప్రతి ఇంటికీ సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్నెట్ ప్యాకేజీలను వినియోగదారులకు తెలియచేసి కనెక్షన్‌లు అందించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కేబుల్ ఆపరేటర్లకు సూచించారు. ఆయన వెంట నారగనేని పులి ఉన్నారు.

మండలిలో ప్రశ్నించే గొంతుకలు అవసరం

- శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు
- 'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు

గుంటూరు ఎడ్యుకేషన్: శాసన మండలిలో ప్రశ్నించే గొంతుకలు అవసరమని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ కె.మోషేన్‌రాజు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం 16 ఏళ్లలో శాసనమండలిలో చేసిన ప్రసంగాల సంకలనం 'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గుంటూరులోని ఎన్జీవో కల్యాణ మండపంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.గేయానంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోషేన్‌రాజు మాట్లాడుతూ ఒక ఎమ్మెల్సీగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడిన సమయం మొత్తాన్ని సూటిగా సమస్యలను ఎలుగెత్తడం మినహా, వ్యక్తిగత, రాజకీయ విమర్శలకు తావు లేని విధంగా హుందాగా వ్యవహరించారని కొనియాడారు.

వ్యక్తిగత ప్రయోజనాలు లేవు

మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడం మినహా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏనాడూ పాకులాడలేదని అన్నారు. యూటీఎఫ్, జనవిజ్ఞానవేదికతో అనుబంధం ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకుని, మాట్లాడే విధానాన్ని అలవర్చుకున్నామని చెప్పారు. సభలో అయినా, సమాజంలో అయినా నిజాయితీగా మాట్లాడే వ్యక్తుల మాటలకే విలువ ఉంటుందని అన్నారు. ఎమ్మెల్సీ, పీడీఎఫ్ ఫ్లోర్‌లీడర్ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో సమర్థవంతంగా గళం విన్పించి, పరిష్కారం దిశగా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. కార్పొరేట్ రాజకీయాలకు దూరంగా ప్రజా సమస్యల పరిష్కారానికై ఆదర్శవంతమైన ఎమ్మెల్సీగా వి.బాలసుబ్రహ్మణ్యం చేసిన ప్రసంగాల్లో ప్రధానంగా విద్య, ఆరోగ్య, సామాజిక, ఉద్యోగ, అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి అంశాల్లో చేసిన ప్రసంగాలను సంకలనం చేసిన తీరు అభినందనీయమన్నారు. ప్రభుత్వాలు చేసే మంచి పనులకు పీడీఎఫ్ ఫోరం మద్దతు ఎప్పుడూ ఉంటుందని, గతంలో సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్ ఐటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తీసుకున్న నిర్ణయాలను తాము మద్దతు పలికామని గుర్తు చేశారు. బాలసుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, పి.రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, మధురై వర్సిటీ ప్రొఫెసర్ వెంకటేష్ ఆత్రేయ, తెలంగాణ జేవీవీ అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు పాల్గొన్నారు.

పక్షి సంపదను కాపాడుకోవాలి

జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



స్వచ్ఛత సేవ కార్యక్రమంలో పాల్గొన్న జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి

పెదకాకాని: సృష్టిలో విలువైన పక్షి జాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో జీఎస్టీ ఉద్యోగులు స్వచ్ఛత సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచానికే తలమానికంగా నిలిచిన ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతూ మానవాళికి ఉపయోగకరంగా ఉన్న పక్షులను కాపాడుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా పది వేల పక్షులు ఉంటే అందులో పదిశాతం పక్షులు అంతరించే దశలో ఉన్నాయని తెలిపారు. పక్షుల వేట, చంపి తినడం, పక్షుల ఆవాసాలు విధ్వంసం చేయడం, గుడ్లు ధ్వంసం, అక్రమ రవాణా వంటి వ్యతిరేక భావాలపై ప్రజల్లో అవగాహన కల్పించి వారిని చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రఖ్యాతి గాంచిన ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో స్వచ్ఛత సేవ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు భాగస్వాములు కావడం అభినందనీయమని చెప్పారు. పక్షుల కేంద్రంలో సమస్యలపై కమిషనర్ పరిశీలించారు. పక్షుల కేంద్రం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఉద్యోగులు పక్షుల కేంద్రాన్ని పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారులు జి.రామకృష్ణరాజు యాదవ్, ఉపేంద్ర, రవికుమార్, సీతారామరాజు, పాండు రంగారావు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, మూర్తి, వేణు, ఈశ్వరరావు, ప్రకాష్‌బాబు, ఆషా, పద్మావతి, కనకదుర్గ, కాకర్ల శ్రీను, శాఖమూర్తి శ్రీను పాల్గొన్నారు.

పెన్సిల్‌తో గీచిన అయోధ్య శ్రీసీతారాములవారి చిత్రం



గుంటూరుఎడ్యుకేషన్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ఏపీ సీఆర్‌డీఏలో గణాంకవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ నడిపల్లి శ్రీనివాస్, శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయుని చిత్రాన్ని పెన్సిల్‌తో ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని మూడు రోజుల వ్యవధిలో ఎంతో ఆకర్షణీయంగా గీశారు.

జింకానాకు రూ.10 లక్షల విరాళం



చెక్కును అందజేస్తున్న డాక్టర్ బాబు

తెనాలి: పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, తన కుమార్తె లక్ష్మీ రూపతో కలిసి గుంటూరు జిల్లా సమగ్ర వైద్యశాల(జీజీహెచ్)లో నిర్మిస్తున్న మాతాశిశు సంరక్షణ వైద్యశాలకు రూ.10 లక్షల విరాళంగా ఇచ్చారు. గుంటూరు వైద్యకళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు 'గుంటూరు మెడికల్ కాలేజి అసోసియేషన్ ఆఫ్ నార్త్' (జింకానా)గా ఏర్పడి వైద్యశాలకు నిధిని సమకూర్చటం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. 1964 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు వివిధ దేశాల్లో నివసిస్తూ, ఆరవై ఏళ్ల తర్వాత వజ్రోత్సవ ఆత్మీయ సమావేశాన్ని బాపట్ల జిల్లా చీరాల వాడరేవులో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ప్రత్యేకంగా ఆ సమావేశానికి హాజరైన డాక్టర్ బాబు, తన భార్య దివంగత డాక్టర్ సీతారామమ్మ జ్ఞాపకార్థం విరాళాన్ని జింకానా ప్రతినిధులు డాక్టర్ సాంబశివరావు కొత్తమాసు, డాక్టర్ బుచ్చిబాబు పైడిపాటికి అందజేశారు. డాక్టర్ వడ్లమూడి సీతారామమ్మ గుంటూరు వైద్యకళాశాల పూర్వవిద్యార్థిని.

వైద్య విద్య బలోపేతానికి సీఎం కృషి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్
- గుంటూరు జీజీహెచ్‌లో క్యాన్సర్ సీఎంఈ



జ్యోతి ప్రజ్వలన చేసి సీఎంఈని ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: వైద్య విద్య బలోపేతానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిర్ధారణపై నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) నిర్వహించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాల వలన క్యాన్సర్ వైద్య విభాగంలో కూడా ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలు వస్తున్నాయని చెప్పారు. క్యాన్సర్ ఆస్పత్రుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.118 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. క్యాన్సర్ ఆస్పత్రులకు మామోగ్రామ్ వైద్య పరికరాలు, వైద్య సిబ్బందిని ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు సుమారు రూ.20 కోట్లు ఖరీదు చేసే పెట్ సీటీస్కాన్ రాబోతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ప్రత్యేక చొరవ తీసుకుని జీజీహెచ్‌కు పెట్ సీటీస్కాన్ తీసుకొచ్చేందుకు కృషి చేశారని వెల్లడించారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి పెట్ స్కాన్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడిగా వైద్యానికి ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారని తెలిపారు. క్యాన్సర్ చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో క్యాన్సర్ చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రతి వైద్య విభాగాన్ని అభివృద్ధి చేసేందుకు డీఎంఈ డాక్టర్ నరసింహం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాట్కో ట్రస్టు వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, జీజీహెచ్ నాట్కో సెంటర్ కో ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, క్యాన్సర్‌వైద్య నిపుణులు డాక్టర్ శంకర్ మహాదేవ్, డాక్టర్ లీలా, గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు, ఒంగోలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వి.రావు, గుంటూరు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 25వ తేదీ నుంచి దశల వారీ పోరాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసిసోయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేట తాలూకా ప్రాంగణంలోని అసిసోయేషన్ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 70, 75 ఏళ్లు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్ తగ్గింపు తగదని, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. హెల్త్‌కార్డులపై వైద్య సదుపాయం అందడం లేదని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద వైద్యం చేయించుకున్న బిల్లులు మంజూరు కావడం లేదని చెప్పారు. ఈహెచ్ఎస్‌లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధిని రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఈనెల 25న అన్ని తాలూకా కేంద్రాలు, 29న జిల్లా కేంద్రాలతో పాటు, ఫిబ్రవరి 5న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు, సంఘ సలహాదారుడు కె.దాలినాయుడు, రాష్ట్ర కోశాధికారి టీవీ ఎస్ఎస్ఆర్ఏ శర్మ పాల్గొన్నారు.

మనోహర్‌కు యంగ్ ఇండియా ఫౌండేషన్ పురస్కారం



సామిదాల మనోహర్

తెనాలి: న్యూఢిల్లీకి చెందిన యంగ్ ఇండియా ఫౌండేషన్ పురస్కారాన్ని తెనాలికి చెందిన సామిదాల మనోహర్ అందుకునానరు. దేశవ్యాప్తంగా రాజకీయ సేవల నందిస్తున్న 30 మంది యువతను ఏటా ఎంపికచేసి అవార్డులను బహూకరిస్తోంది. తెనాలి నందులపేటకు చెందిన మనోహర్ వీరిలో ఒకరు. పార్లమెంటు స్పీకర్ ఓం బిర్లా వద్ద జేఆర్ అసోసియేట్, న్యూఢిల్లీలో మూడేళ్లుగా పని చేస్తున్నారు. యంగ్ ఇండియా పురస్కారాన్ని అందుకున్న మనోహర్‌ను పార్లమెంటు సిబ్బంది, కోయంబత్తూరులోని అమృతా యూనివర్శిటీ వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఒంగోలు జాతి పశు సంరక్షణ అందరి బాధ్యత

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- అట్టహాసంగా దుర్గిలో ఒంగోలు జాతి పశు బల పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిఆర్కే

దుర్గి: ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒంగోలు జాతి పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. దుర్గిలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల సందర్భంగా రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి పశుబల ప్రదర్శన పోటీల్ని ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి పశుపోషకులు పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాశల కోర్చి గత కొన్ని సంవత్సరాలుగా పోటీల్ని నిర్వహిస్తున్న కమిటీ సభ్యుల్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద, షేక్ షఫీ, పీఏసీఎస్ చైర్మన్ కటకం రామారావు, మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, పార్టీ కన్వీనర్లు ఉన్నం పెద్దబ్బాయ్, యకటీల బుచ్చిబాబు, పాల్గొన్నారు.

నాలుగు పళ్ల విభాగంలో కొప్పురావూరి ఎడ్లకు ప్రథమ స్థానం

తొలి రోజు నాలుగు పళ్ళ విభాగానికి సంబంధించిన పోటీలలో 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి.

- గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరికి చెందిన తోట శ్రీనివాసరావుకు చెందిన ఎడ్ల జత 15నిమిషాల నిర్ణీత సమయానికి 4801.3 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచింది.
- గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లు 4759 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి.
- కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం కేశవాపురం గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 4502.2 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి.
- పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన మదనబోయిన పోతురాజు యాదవ్ ఎడ్లు, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వై. కొత్తపల్లి గ్రామానికి చెందిన కవులూరి హుస్సేన్ ఎడ్లు ఒకే విధంగా 4500 అడుగులు దూరం లాగి నాలుగో స్థానంలో నిలిచాయి.
- పల్నాడు జిల్లా గురజాల మండలం గురజాల గ్రామానికి చెందిన లింగయ్య అంజయ్య చౌదరి ఎడ్లు 4200 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయని కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులను శాలువాలతో సత్కరించి, మెమెంటోను, నగదును అందజేశారు.

రైతులకు ష్యూరిటీ లేని రుణాలు

వినుకొండ(నూజెండ్ల): రైతులకు ష్యూరిటీ లేని రుణాల్ని మంజూరు చేస్తున్నట్లు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం సొసైటీ చైర్మన్లు, సెక్రటరీలు, బ్యాంక్ సిబ్బంది, రైతన్నలతో సమావేశం నిర్వహించారు. స్థానిక శాసన సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు, చైర్మన్ రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నలకు మేలు జరిగే విధంగా సబ్సిడీతో రుణాల్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలో రూ.25 కోట్లను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జీడీసీసీ బ్యాంక్, నాబార్డు సంయుక్తంగా రైతన్నలకు ష్యూరిటీ లేకుండా లక్ష రూపాయలను అందజేయనున్నట్లు వెల్లడించారు.

వడ్డెరలలో రాజకీయ, సామాజిక చైతన్యం

ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం




ప్రభుత్వ ఉద్యోగం సాధించిన అభ్యర్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం

గుంటూరు ఎడ్యుకేషన్: వడ్డెరలలో రాజకీయ, సామాజికంగా ప్రాధాన్యం కల్పిస్తూ ప్రభుత్వం వారిలో చైతన్యం నింపుతోందని ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం పేర్కొన్నారు. అరండల్‌పేటలోని దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజంలో ఏపీ వడియరాజుల ఉద్యోగుల సంక్షేమ సంఘం, అమరావతి సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గతంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వడ్డెర విద్యావంతులకు సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రగిరి యేసురత్నం మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వం అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పిస్తోందని తెలిపారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్మాదుల చేతిలో బలైన బాలిక తల్లిదండ్రులకు ఆయన వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా సంఘం తరఫున మరో రూ.75 వేలు అందించారు. కార్యక్రమంలో వడియరాజుల సంక్షేమ సంఘంతో పాటు వడ్డెర సామాజిక వర్గ, వడ్డెర ఉద్యోగ సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ వడియరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పిచ్చయ్య

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): ఆంధ్రప్రదేశ్ వడియరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా చల్లా పిచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అరండల్‌పేటలోని దేశీయ విశ్వ బ్రాహ్మణ సమాజంలో వడియరాజ్ ఉద్యోగుల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సంఘ ప్రధాన కార్యదర్శిగా తన్నీరు శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు పిచ్చయ్య మాట్లాడుతూ వడియరాజ్ ఉద్యోగుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తానన్నారు.

ఫైబర్ నెట్ సర్వీసులపై అవగాహన సదస్సు




అవగాహన కల్పిస్తున్న ఫైబర్ నెట్‌వర్క్ ప్రతినిధులు

నెహ్రూనగర్: నిత్య జీవితంలో ఇంటర్నెట్ ప్రతి ఒక్కరికి అవసరమని, అందరికి ఇంటర్నెట్ సదుపాయం అందించాలన్న సంకల్పంతో ఏపీ ప్రభుత్వం తక్కువ ధరలకు నెట్‌సర్వీస్ తీసుకొచ్చిందని ఫైబర్ నెట్‌వర్క్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలో ఫైబర్‌నెట్ సర్వీసులపై కేబుల్ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇంటర్నెట్ సౌకర్యం వినియోగదారులకు తక్కువ ధరలకు అందించి ఎక్కువ లాభం ఆర్జించవచ్చన్నారు.

సమాజ చైతన్య బావుటాలే నా కథలు

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్



తెనాలి: దేశంలో జరుగుతున్న పరిణామాలపై సామూహికంగా ప్రేరణ తీసుకురావాలనే భావనతో కథలు రాస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ అన్నారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో నెలనెలా చర్చలో భాగంగా శనివారం సాయంత్రం వేంపల్లె షరీఫ్ కథాసంపుటాలు 'జుమ్మా', 'టోపి జబ్బార్'పై చర్చా వేదిక నిర్వహించారు. జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. వేంపల్లె షరీఫ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో పనిచేస్తున్న కాలంలో తనదాక వచ్చిన వివక్షను నమ్మి, తన జీవితానికి సంబంధించిన అంశాలను తానే చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తన రచనా ప్రస్థానాన్ని వివరించారు. సాహితీ విమర్శకుడు సుంకర గోపాల్ తన ప్రసంగంలో మత దురహంకారం, వివక్ష ఎక్కడ ఉంటాయో? అక్కడ షరీఫ్ కథలుంటాయని చెప్పారు. రాయలసీమలోని ముస్లింల కథలే అయినప్పటికీ ప్రతి ఊరిలోనూ ఈ కథల్లోని సమస్యలు ఉంటాయని చెబుతూ వాస్తవానికి తెలుగు సాహిత్యానికి షరీఫ్ చేసిన చదివింపులే జుమ్మా కథాసంపుటిగా వ్యాఖ్యానించారు. సమావేశంలో రచయిత లలితానంద ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో కనపర్తి బెన్‌హర్, జుగాష్‌విలి, ఉమా, డాక్టర్ పిల్లి వాసు, నందూరి నారాయణరావు పాల్గొన్నారు.